క్లుప్తంగా

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి వినతి



జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ హరిందిర ప్రసాద్‌కు సమస్య వివరిస్తున్న తోట పద్మావతి

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డు పరిధిలోని భూపేష్ నగర్‌లో షెడ్యూల్ కాస్ట్ (ఇ) వర్గానికి చెందిన కుటుంబాలు అధికంగా నివసిస్తున్నందున వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం జీవీఎంసీ కార్యాలయంలో కమిషనర్ ఛాంబర్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి వార్డు సమస్యలను వివరించారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలోని ప్రజలు తమ కుటుంబ కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి తగిన కమ్యూనిటీ హాలు లేకపోవడం వల్ల దూర ప్రాంతాల్లో ఉన్న కల్యాణ మండపాలు అద్దెకు తీసుకోవలసి వస్తోందని వివరించారు. ఇది వారికి ఆర్థికంగా భారంగా మారుతోందని, పెద్ద సంఖ్యలో ప్రజలు ఒక్క చోట కలిసి సమావేశమయ్యే, తమ సంప్రదాయాలను పాటించే స్థలం లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

నేడు కేజీహెచ్‌లో కొత్త నిర్మాణాలు ప్రారంభం

అల్లిపురం: కేజీహెచ్‌లో శనివారం పలు కొత్త నిర్మాణాల ప్రారంభోత్సవం జరగనున్నదని సూపరింటెండెంట్ పి.శివానంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేజీహెచ్ ఆవరణలో మార్చురీ వద్ద నిర్మించిన పోలీస్ అవుట్ పోస్ట్, టిస్లా సెంటర్ వద్ద రోగుల నిరీక్షణ షెడ్లు, ఫార్మసీ వద్ద రోగుల నిరీక్షణ షెడ్లకు ప్రారంభోత్సవం జరుగుతుందని తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్, కలెక్టర్ హరేందిరప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పాల్గొంటారని పేర్కొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి యోగా తరగతులు



యోగా సాధన చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

డాబాగార్డెన్స్: ఈ నెల 21న ఆర్‌కే బీచ్ వేదికగా నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్రలో భాగంగా శుక్రవారం ఆర్టీసీ సిబ్బందికి విశాఖపట్నం డిపోలో ఉదయం 7 నుంచి 8 గంటల వరకు యోగా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో విశాఖ డిపో మేనేజర్ కె. గంగాధరరావు యోగా ప్రాముఖ్యత సిబ్బందికి వివరిస్తూ, ప్రతి ఒక్కరూ యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో పాటు, మానసిక ప్రశాంతత చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో విశాఖపట్నం డిపో ట్రాఫిక్, గ్యారేజ్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రైడేతో దోమల నియంత్రణ



డ్రమ్ములో పెరుగుతున్న దోమ లార్వాలను పరిశీలిస్తున్న హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్

సీతంపేట: వారానికి ఒక రోజు డ్రైడే పాటిస్తే దోమల పెరుగుదలను నియంత్రించవచ్చని మలేరియా హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 25వ వార్డు సీతంపేటలో శుక్రవారం ఫ్రైడే–డ్రైడే కార్యక్రమ అమలు తీరును పరిశీలించారు. ఏఎన్ఎం, ఆశా, యాంటీ లార్వా ఆపరేషన్స్ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వలను పరిశీలించారు. కుండీలు, డ్రమ్ముల్లో లార్వాలు పెరుగుతున్నట్టు గుర్తించి, ఆ నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వారం రోజులు దాటి మంచినీరు, వర్షపు నీరు నిల్వ ఉంటే మలేరియా, డెంగ్యూ జ్వరాలను కలుగజేసే దోమలు వృద్ధి చెందే అవకాశముందన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలని, వారానికి ఒక రోజు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి, గోళాలు, కుండీలు, సంపులు, ట్యాంకుల్లో నీటిని తొలగించి ఆరబెట్టి మళ్లీ నీటిని పట్టుకోవాలని సూచించారు.

నాడు ఘనం.. నేడు దైన్యం

- ఆదరణ కోల్పోతున్న సినిమా థియేటర్లు
- రోడ్డున పడుతున్న వర్కర్ల జీవితాలు
- రెంటల్ విధానంతో నష్టమంటున్న థియేటర్ల యజమానులు



మూలకు చేరిన పూర్ణా థియేటర్

జగదాంబ: ఒకప్పుడు సినిమా థియేటర్లలో కనిపించే సందడి ఇప్పుడు కానరావడంలేదు. అభిమాన హీరో సినిమా వచ్చిందంటే చాలు రాత్రంతా థియేటర్ల ముందు భారీ కటౌట్లు, గజమాలలు, కేక్ కటింగ్‌లతో అభిమానులు సందడి చేసేవారు. నచ్చిన హీరో సినిమా ఫ్లాప్ అయినా కనీసం యాభై రోజులు సొంత డబ్బులతో ఆడించే రోజులు ఉండేవంటే నమ్మాలి. అటువంటి థియేటర్లు ఒకటొకటిగా మూతబడుతూ సినిమా హాళ్ల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. విశాఖపట్నం అంటే ఒకప్పుడు పాతనగరమే. నాడు అక్కడ లక్ష్మీ టాకీస్, శ్రీకృష్ణా, మినర్వా, మనోరమ, పూర్ణా థియేటర్, రామకృష్ణా, నవరంగ్, ప్రభాత్, సత్యనారాయణ, సరస్వతి, గీత్, సంగీత్ వంటి ప్రసిద్ధ సినిమా థియేటర్లు ఉండేవి. అయితే అవన్నీ కాలక్రమంలో మూతపడ్డాయి. తర్వాత జగదాంబ, చిత్రాలయ, అలంకార్, మెలోడీ, లీలామహల్, సంగం, శరత్, శ్రీకన్య, శారద, రమాదేవి వంటి థియేటర్లు వచ్చాయి. వీటిలో కూడా కొన్ని మూతపడ్డాయి. కొన్ని థియేటర్ల స్థానంలో షాపింగ్ మాల్స్, అపార్ట్‌మెంట్లు వెలిశాయి.

రోడ్డున పడ్డ జీవితాలు..

సినిమా తీయడం ఎంత కష్టమో.. థియేటర్లలో సినిమా ఆడించాలన్నా అంతే కష్టంగా వ్యవహారం మారిపోయింది. థియేటర్లలో సినిమా వేసే ప్రొజెక్టర్ ఆపరేటర్లు, బుకింగ్‌లో టిక్కెట్లు అమ్మేవాళ్లు, గేట్ల వద్ద టిక్కెట్ కలెక్షన్ చేసేవాళ్లు, లోపల తినుబండారాలు అమ్మేవాళ్లు, థియేటర్ మేనేజర్లు.. ఇలా చెప్పుకుంటూ పోతే అందరు నేడు రోడ్డున పడ్డారు.

కల్యాణ మండపాలు.. అపార్ట్‌మెంట్లుగా..

సినిమా హాళ్లు కల్యాణ మండపాలుగా, అపార్ట్‌మెంట్లుగా మారిపోతున్నాయి. పలుచోట్ల కల్యాణ మండపాలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో కొన్ని సినిమా హాళ్లు కల్యాణ మండపాలుగా రూపాంతరం చెందుతున్నాయి. అలాగే షాపింగ్ మాల్స్, అపార్ట్‌మెంట్లుగాను నాటి సినిమా హాళ్లు మారిపోతున్నాయి. దీంతో నాటి సినిమా థియేటర్లలో చాలా వరకు ఇప్పుడు కనిపించడం లేదు. ఏది ఏమైనా సామాన్యుడి వినోదానికి చిరునామాగా నిలిచే సినిమా హాళ్లు మూతపడటం పట్ల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిర్వహణ కష్టమంటున్న యజమానులు..

సినిమా హాలు నిర్వహణ కష్టంగా మారుతోందని సినిమా హాళ్ల నిర్వాహకులు చెబుతున్నారు. సినిమా వేసినా వేయక పోయినా నెలకి రూ. 1.5 లక్షల నుంచి రూ. 3 లక్షలు వెచ్చించాల్సి ఉంటుందంటున్నారు. విద్యుత్ బిల్లే నెలకు రూ. 55 వేలు చెల్లించాల్సి ఉంటుందని వాపోతున్నారు. సినిమా వేస్తే ఈ ఖర్చు మరింత పెరుగుతుందని చెబుతున్నారు. రెంటల్ విధానం నష్టం కలిగిస్తుందని వాపోతున్నారు. పెర్సంటేజీ విధానం వల్ల కొంత వరకు మేలు కలుగుతుందన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

డిజిటల్ వ్యవస్థ వచ్చాక..

పాతకాలంలో రీల్ తిరగాలి.. బొమ్మ పడాలి అన్నట్లు ఉండేది. తర్వాత డిజిటల్ వ్యవస్థ వచ్చింది. చిప్‌లు పెడితే సినిమా ఆడేది. ఇప్పుడు శాటిలైట్ వ్యవస్థ.. ఐనాక్స్‌లు వచ్చాయి. దీనికి తోడు యూట్యూబ్, నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్, ఆహా వంటి ఓటీటీ వ్యవస్థలు రావడంతో సినిమా చూడటం సులభం అయిపోయింది. గతంలో ఆదివారం లేదా పెళ్లిళ్లు, పేరంటాల సమయంలో కుటుంబం యావత్తు సినిమాలకు వెళ్లేవారు. ఫ్రెండ్స్, ప్రియురాలితో సినిమాలు చూసేవారు. ఇప్పుడు ఓటీటీ ద్వారా కొత్త సినిమాలను కూడా ఇంట్లో 55, 65 ఇంచ్‌ల ఆండ్రాయిడ్ టీవీల్లో కుటుంబం అంతా ఒకే దగ్గర కూర్చుని చూస్తున్నారు. దీని వల్ల థియేటర్లకు క్రమేపీ ఆదరణ తగ్గిపోతోంది.

ఓటీటీల వల్ల ఇబ్బంది..

కొత్త సినిమాలు రెండు మూడు వారాల్లోనే ఓటీటీల్లోకి వస్తుండడం వల్ల సినిమా హాళ్లకు వచ్చేవారు ఇళ్లకే పరిమితమవుతున్నారు. దీంతో సినిమా హాళ్లను ఒక వర్గం వారు మరిచిపోయారని చెబుతున్నారు. దీనికి తోడు ఇళ్లలోనే హోం థియేటర్లు నిర్మించుకుని నచ్చిన సమయంలో నచ్చిన సినిమా చూస్తున్నారు. కాస్త డబ్బులు ఉన్నవారు ఇంట్లోనే చిన్న గదిలో సినిమా హాలు నిర్మించుకుంటున్నారు. 8 మంది కూర్చునే హాలు నిర్మించేందుకు రూ. 8 లక్షలు ఖర్చవుతోందని చెబుతున్నారు. ఇది చాలా సౌకర్యవంతంగా ఉంటోందని అంటున్నారు. చిన్న తెర ప్రొజెక్టర్, సౌండ్ సిస్టమ్, సోఫాలు ఇలా ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు.



షాపింగ్ కాంప్లెక్స్‌గా మారిన రామకృష్ణా థియేటర్



పాత థియేటర్లలో ఇప్పటికీ నడుస్తున్న లీలామహల్ థియేటర్



అపార్ట్‌మెంట్‌గా మారిన సత్యనారాయణ థియేటర్

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



అల్లిపురం శాఖా గ్రంథాలయంలో జరిగిన ముగింపు వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు, అతిథులు



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజు

అల్లిపురం: శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో నెల రోజులుగా శిక్షణ పొంది, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమారరాజు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాలను వేసవి సెలవుల్లోనే కాకుండా, మిగితా సమయంలో కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలు తోడ్పడతాయన్నారు. అదే విధంగా ఇంట్లో పెద్దవాళ్లకు, స్నేహితులకు చెప్పి గ్రంథాలయ సభ్యత్వం తీసుకునేలా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పీవీఎన్ రాజు, పాఠకులు పాల్గొన్నారు.

సెలవుల్లోనూ లైబ్రరీకి రండి..

డాబాగార్డెన్స్: సమ్మర్ క్యాంప్ సందర్భంగా లైబ్రరీలకు వచ్చినట్టే స్కూల్ సెలవు రోజుల్లో కూడా రావాలని విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి. కుమార్‌రాజు విద్యార్థులకు తెలిపారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం వేసవి శిబిరాలు ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పౌర గ్రంథాలయ శాఖ నిర్వహణలో జిల్లా గ్రంథాలయ సంస్థ సూచనలతో జిల్లాలోని అన్ని శాఖా గ్రంథాలయాల్లో నలభై రోజుల పాటు సాగిన వేసవి విజ్ఞాన శిబిరాలు పిల్లల్లో సృజనాత్మకత, విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించే ప్రయత్నం చేసిందన్నారు. ఉపాధ్యాయుల మాదిరి ఇతర రీసోర్స్ పర్సన్స్‌తో మమేకమవుతూ నిర్వహించిన లైబ్రేరియన్ల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. సమ్మర్ క్యాంపులో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త, లైబ్రరీ కమిటీ సభ్యుడు కేవీఎస్ నరసింహం, అల్లిపురం లైబ్రేరియన్ పీవీఎన్ రాజు, డీసీఎల్ లైబ్రేరియన్ ఎల్. రాజేంద్రవర్మ, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు బీహార్ వ్యక్తి



కుటుంబ సభ్యులకు రాంబిహారీని అప్పగిస్తున్న శ్రద్ధ ఫౌండేషన్ ప్రతినిధి

అల్లిపురం: నల్లమందుకు అలవాటు పడి మతిస్థిమితం కోల్పోయి రోడ్డున పడ్డ బీహార్ వ్యక్తిని ఏయూటీడీ సభ్యులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. జీవీఎంసీ ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రం, దర్భంగ జిల్లా సిసపునా గ్రామానికి చెందిన రాంబిహారి ఇల్లు వదిలిపెట్టి లూథియానా వెళ్లిపోయాడు. అక్కడ బిచ్చగాళ్లతో స్నేహం చేసి నల్లమందుకు అలవాటుపడ్డాడు. దీంతో మానసిక ఆరోగ్యం దెబ్బతినడంతో మత్తులో ఎక్కడెక్కడో తిరిగి విశాఖ చేరుకున్నాడు. గత ఏడాది నవంబర్‌లో రైల్వే స్టేషన్‌లో ఏయూటీడీ సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్‌లో అతను పట్టుబడ్డాడు. అతన్ని షెల్టర్‌కు తరలించి పూణేకి చెందిన శ్రద్ధ ఫౌండేషన్ సహకారంతో చికిత్స అందించడంతో అతని ఆరోగ్య పరిస్థితి మెరుగుపడింది. దీంతో అతన్ని నేరుగా బీహార్‌లోని అతని స్వగ్రామానికి తీసుకెళ్లి అతని తల్లి కౌశల్య ముఖియా, సోదరుడు రాజ్‌కుమార్ ముఖియాకు అప్పగించారు. దీంతో వారు ఏయూటీడీ, శ్రద్ధా ఫౌండేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

సందడిగా స్నాతకోత్సవం



ముఖ్య అతిథులతో సేఫ్టీ కోర్సుల సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహిస్తున్న సేఫ్టీ కోర్సులకు స్నాతకోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఫైర్ సేఫ్టీ కోర్సుల్లో కోర్సులు పూర్తి చేసిన వారికి స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ జారీ చేసిన సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ముఖ్య అతిథి జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకరరెడ్డి, విశిష్ట అతిథి స్టీల్‌ప్లాంట్ జీఎం(శిక్షణ, హెచ్‌ఆర్‌డీ) టి.కె.ఎస్.ఆర్.ఠాగూర్ శిక్షణార్థులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో సేఫ్టీ కోర్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, కరిక్యులం కో ఆర్డినేటర్ ఎ.వరహాలు, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ వి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సిరులతల్లికి తులసి పూజ..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

మధురానగర్ హైస్కూల్ హెచ్‌ఎం బాధ్యతల స్వీకరణ



హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీ నరస

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్ హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయినిగా శుక్రవారం లక్ష్మీ నరస బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తున్న లక్ష్మీ నరస ఈ స్కూల్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ హెచ్‌ఎంగా పనిచేసిన శాంతికుమారి రైల్వే న్యూకాలనీ కేఎస్ఎం స్కూల్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీ నరస మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందిస్తానని తెలిపారు.

వైభవుడికి సుప్రభాత సేవ నేడు



మురళీనగర్: కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

చంద్ర రాజేశ్వరరావుకు ఘన నివాళి



చంద్ర రాజేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు

అల్లిపురం: తెలంగాణ సాయుధ, రైతాంగ పోరాట యోధుడు, స్వాతంత్ర్య సమరయోధుడు చంద్ర రాజేశ్వరరావు 111వ జయంతి అల్లిపురం సీపీఐ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.కె. రెహమాన్, జిల్లా సహాయ కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్ తదితరులు చంద్ర చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ 28 ఏళ్ల పాటు సుదీర్ఘకాలం పార్టీ ప్రధాన కార్యదర్శిగా దేశ ప్రజలకు సేవలందించడమే కాక తాను నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతం కోసం చివరి శ్వాస విడిచే వరకు నిబద్ధతతో జీవించారని కొనియాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నడపడంలో క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. దేశవ్యాప్తంగా అనేక భూ పోరాటాలు నిర్వహించి గూడు లేని నిరుపేదలకు భూస్వాముల కబంధ హస్తాల్లో ఉన్న భూమిని పంచిన ఘన చరిత్ర దక్కుతుందన్నారు. బతికినంత కాలం సామాన్యమైన జీవితం గడపడమే కాక నేటి తరానికి ఆ మహనీయుని జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన బాటలో నేటి తరం యువకులు, పార్టీ శ్రేణులు ముందుకు నడవాలని, అప్పుడే ఆ పోరాట యోధుని ఆశయాలను ముందుకు తీసుకుపోగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఎం ఏ బేగం, సీహెచ్ కాసుబాబు, జి. రాంబాబు, యు. నాగరాజు, అప్పన్న, అన్వేషి, సందీప్ తదితరులు పాల్గొన్నారు

నేత్రపర్వంగా కల్యాణోత్సవాలు



స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



ధ్వజారోహణం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

అల్లిపురం: జగదాంబ జంక్షన్ సమీపంలోని శ్రీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామి వారి కల్యాణం శుక్రవారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. శ్రీ విశ్వేశ్వర స్వామి వారికి శ్రీ బాలా త్రిపుర సుందరి అమ్మవారితో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య కల్యాణం చూడ ముచ్చటగా జరిగింది. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఈవో అడపా దేముళ్లు పర్యవేక్షణలో ఈ కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.

అంబికాబాగ్ రామాలయంలో ధ్వజారోహణం..

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దత్తత దేవాలయం అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ధ్వజారోహణం, అంకురార్పణ నిర్వహించారు. శనివారం ఉదయం విశేష హోమాల అనంతరం, 10.30 గంటలకు స్వామి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరపనున్నారు. సాయంత్రం విశేష హోమాలు నిర్వహించనున్నారు.

గంజాయి కేసులో ఇద్దరికి రిమాండ్

మద్రిపాలెం: గంజాయి కేసులో తప్పించుకుని తిరుగుతున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు జీఆర్‌పీ సీఐ ధనంజయనాయుడు తెలిపారు. కాకినాడ జిల్లా తిమ్మాపురానికి చెందిన కొప్పిశెట్టి రాజేష్, తాడేలు నాగవెంకట శేషు అనే వీరిద్దరిని శుక్రవారం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న సమయంలో గుర్తించి అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్టు చెప్పారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.